క్లుప్తంగా

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మధురవాడ ఐటీ హిల్స్ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



పూజలందుకున్న చోడేశ్వరస్వామి

పెందుర్తి: పినగాడి చోడేశ్వరస్వామి ఆలయ 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో చోడేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో దాదాపు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం కల్యాణం వైభవంగా జరిపారు. కోలాటాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి, ఆలయ ధర్మకర్త బండారు సింహాచలం, ఆలయ కమిటీ ప్రతినిధులు, వేలాదిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

శ్రీరామ్మూర్తి పోరాటాలు స్ఫూర్తిదాయకం

గాజువాక : పౌర హక్కుల సంఘం నేత తుంపాల శ్రీరామ్మూర్తి పోరాట తెగువ, సమస్యలపై అధ్యయనం చేసే విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఐ సీనియర్ నేత ఎ.జె.స్టాలిన్ అన్నారు. దళిత, గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు ఎంతో ధైర్యసాహసాలతో కూడుకున్నవని అన్నారు. శ్రీరామ్మూర్తి ఆరు దశాబ్దాల పోరాట ప్రస్థానం సందర్భంగా గాజువాకలో ఆయన్ను వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి నిర్వహించిన వివిధ పోరాటాలను వివరించారు.

మెనూ అదుర్స్

నాడు: **ఒకప్పుడు వసతి గృహ భోజనం అంటే పురుగులు పట్టిన అన్నం..రుచి పచీ లేని కూరలు. అమావాస్యకో, పున్నానికో అన్నట్టుగా చికెన్ కూర పెట్టే** వారు. మొత్తంగా చంద్రబాబు పాలనలో వసతి గృహాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. సంక్షేమ హాస్టళ్లు బూత్ బంగ్లాను తలపించేలా ఉండేవి. ఫలితంగా విద్యార్థుల ఆదరణ లేక ఒక్కోటి మూసి వేసే పరిస్థితి ఉండేది.

నేడు: **వసతి గృహాల్లో ప్రతి రోజూ పండగ అన్న రీతిలో విద్యార్థులకు విందు భోజనం అందుతోంది. వారంలో మూడు రోజులు కోడి కూర పెడుతున్నారు. వైఎస్సార్ సీపీ** ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల బలోపేతంపై దృష్టి పెట్టి మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తోంది. విద్యార్థులు మళ్లీ హాస్టళ్లకు క్యూ కడుతుండడంతో నాడు మూసివేసిన వాటిని సైతం తెరిచేందుకు సంక్షేమ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

- హాస్టల్ విద్యార్థులకు విందు భోజనం
- వారంలో మూడు రోజులు కోడి కూర
- ప్రతి రోజూ ఉడికించిన గుడ్డు
- చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం
- సంక్షేమ హాస్టళ్ల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
- విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షం



భోజనం చేస్తున్న విద్యార్థులు



పరదేశిపాలెం సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలికల వసతి గృహం



భోజనం చేస్తున్న విద్యార్థులు



కాలేజీ హాస్టల్లో భోజనం వడ్డించుకుంటున్న విద్యార్థులు

విశాఖ విద్య: సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యానికి పెద్ద పీట వేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి పెంచిన డైట్ చార్జీలు అమల్లోకి వచ్చాయి. దీంతో విద్యార్థులకు బలవర్థకమైన ఆహారం అందుతోంది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో 3, 4 తరగతులకు రూ.1000 మాత్రమే ఇవ్వగా, దీన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1,150లకు పెంచింది. 5 నుంచి 10వ తరగతి వరకు గతంలో రూ.1,250లు ఇవ్వగా, దీనిని రూ.1,400 లకు పెంచారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గతంలో రూ.1,400లు ఇవ్వగా, దీనిని రూ.1,600లకు పెంచారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా డైట్‌చార్జీలతో పాటు, కాస్మోటిక్ చార్జీలను సైతం పెంచడంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతోంది.

కోడి కూర..స్పెషల్ బిర్యానీ

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, మైనార్టీ, గురుకులాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చదువుతున్న సుమారు పది వేల మంది విద్యార్థులకు ప్రస్తుతం బలవర్థకమైన పౌష్టికాహారం అందుతోంది. ప్రతీ రోజూ ఉడికించిన కోడి గుడ్డు విద్యార్థులకు అందిస్తున్నారు. ఉదయం పాలు, కొద్ది సేపటి తర్వాత వేరుశనగ చిక్కీ, సాయంత్రం వేళ సేమియా, గుగ్గిళ్లు వంటి స్నాక్స్ ఇస్తున్నారు. ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో వారంతో మూడు రోజులు కోడి కూర, ఆదివారం స్పెషల్ బిర్యానీ పెడుతుండడంతో మాకు ప్రతీ రోజూ విందు భోజనమే అని విద్యార్థులు అంటున్నారు.

హాస్టళ్ల బలోపేతంపై దృష్టి

వెనుబడిన వర్గాల విద్యార్థుల చదువులకు భరోసాగా నిలిచేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఠంఛన్‌గా అందుతుండడంతో విద్యార్థులు చదువుల బాట పడుతున్నారు. హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ప్రత్యేక చొరవతో జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో వసతి గృహాలను అభివృద్ధి చేస్తున్నారు.

ఆరోగ్య వంతులుగా ఉండాలనే..



వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటేనే చదువుల్లో రాణిస్తారు. అందుకోసం విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నాం. వసతి గృహాలపై తరచూ పర్యవేక్షణ చేస్తున్నాం.

– కె. రామారావు, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా

పరిశుభ్రతకు ప్రాధాన్యం



విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణకు రుచికరమైన భోజనం అందించడంతో పాటు, వసతి గృహ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. విద్యార్థులకు తరచూ ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అంతా సమన్వయంతో విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్నాం.

– దాసరి సత్యారావు, బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్

భోజనం ఎంతో బాగుంటుంది



మా అన్నయ్య మహేష్, నేను కూడా సాంఘిక సంక్షేమ గురుకులంలో చదువుకుంటున్నాం. మాకు ఎంతో రుచికరమైన భోజనం పెడుతున్నారు. హాస్టల్ అంటే ఒకప్పుడు ఇబ్బంది కరంగా ఉండేది. కానీ ఇప్పుడు సౌకర్యాలు బాగా మెరుగయ్యాయి. మా సార్లు చదువు కూడా బాగా చెబుతారు.

– కటారి దేవేందర్, పదో తరగతి, శ్రీకృష్ణాపురం

సంక్షేమానికి దీటుగా అభివృద్ధి



ఓపెన్ జిమ్ పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి: సంక్షేమం..అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. నియోజకవర్గాన్ని సంక్షేమానికి దీటుగా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం బీఆర్‌టీఎస్ రహదారి నుంచి ఆర్టీసీ లేఅవుట్ వరకు రూ.32.48 లక్షలు, నూకాలమ్మ ఆలయం వద్ద రూ.38.54 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న ఓపెన్ జిమ్ పనులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. జీవీఎంసీలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని చెప్పారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌రావు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

పరవాడ: క్యాన్సర్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌రావు భక్షి కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌లో మంగళవారం క్యాన్సర్‌పై మహిళ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డీజీఎం గిరిధర్‌రావు మాట్లాడుతూ క్యాన్సర్ రోజు రోజుకూ విస్తరిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. స్క్రీనింగ్ టెస్టులు చేసుకోవడానికి ముందుకు వచ్చిన మహిళలను ఆయన అభినందించారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందన్నారు. ప్రాణహాని ఉండబోదన్నారు. అవగాహన సదస్సును బుధవారం నిర్వహించనున్నట్టు తెలిపారు. రాంకీ ఫౌండేషన్ హెడ్ శ్రీకాంత్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలను మారుమూల ప్రాంతాలకు విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఫార్మా పరిశ్రమలకు చెందిన మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత

ఎంపీపీ బోకం సూర్యకుమారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: బాల్య వివాహాల నిర్మూలనను మనమంతా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. మండల పరిషత్ సమావేశమందిరంలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. గ్రామ స్థాయి నుంచి బాల్య వివాహాల నిరోధానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కృషి చేయాలన్నారు. ఆడ పిల్లలపై వివక్ష నేటికీ కొనసాగుతుందన్నారు. సమాజంలో బాధ్యతాయుతంగా,నైతికంగా జీవించేది స్త్రీలు మాత్రమేనన్నారు. అటువంటి స్త్రీలకు బాల్యవివాహాలు చేసి వారి జీవితాలను చిన్న వయస్సులోనే తుంచేయడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. బాల్య వివాహాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తూ కఠినమైన చట్టాలు చేశాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళల సంక్షేమం,సాధికారత దిశగా అడుగులు వేస్తుందన్నారు. తహసీల్దార్ చలమయ్య మాట్లాడుతూ ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా క్షేత్ర స్థాయిలో సహకారం ఉన్నప్పుడే పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు నిర్మూలన, లింగ నిర్ధారణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. సీఐ పిన్నంటి రమణ మాట్లాడుతూ సంకుచిత భావాలతో మైనర్ బాలికలకు వివాహాలు చేస్తున్నారన్నారు. మండల పరిషత్ ఏవో ఎస్. బాబూరావు, లా యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయలక్ష్మి, డైరెక్టర్ ఆఫ్ సీడ్ ఆర్గనైజర్ రాజు, మండల అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి. సూర్యనారాయణ, సబ్బవరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చక్రవర్తి, మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు వేతనాల చెల్లింపునకు వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఉక్కు నాన్ జేసీఎం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జీతాల అంశంపై హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీని నాయకులు మంగళవారం కలిశారు. రూ. 2100 కోట్లు సేల్స్ జరిగినా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీజీఎం సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి, జగదీశ్, కొమ్మినేని శ్రీనివాసరావు, వరసాల శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి పాల్గొన్నారు.

అందుబాటులోకి చినముషిడివాడ కల్యాణ మండపం

11 నుంచి కేటాయింపులు

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో పెందుర్తి మండలం చినముషిడివాడ వుడా లేఅవుట్‌లో జోగులాంబ బస్ స్టాప్ వద్ద నిర్మించిన అధునాతన కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈనెల 11 నుంచి శుభ కార్యాలకు అతి తక్కువ ధరలకు రోజు వారీ అద్దె ప్రాతిపదికన కేటాయించనున్నారు. విశాలమైన పార్కింగ్ సదుపాయం నుంది. రెండు ఫంక్షన్‌లు చేసుకోవడానికి వీలుగా గ్రౌండ్ ఫ్లోర్, మొదటి ఫ్లోర్‌లో వివిధ సౌకర్యాలు కల్పించామని వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఇ.భాను ప్రసాద్(9246165557), వి.భానుమూర్తి(9700354772)ని సంప్రదించాలని వుడా కార్యదర్శి కోరారు.

భద్రత ప్రమాణాలు పాటించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

పరవాడ: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించి కార్మికులకు భరోసా కల్పించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. 53వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫార్మాసిటీలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గనిశెట్టి మాట్లాడుతూ కార్మికులకు భద్రత పరికరాలు అందించడానికి యాజమాన్యాలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.అప్పలరాజు, జి.చిట్టిబాబు, ఎస్.అప్పలనాయుడు, కొండబాబు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్



కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రమణ

సబ్బవరం: సబ్బవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కేంద్ర పారా మిలటరీ దళాలతో సీఐ పిన్నంటి రమణ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ సత్యనారాయణ కేంద్ర బలగాలకు పలు సూచనలు చేశారు. సుమారు 70 మంది కేంద్ర బలగాలతో పాటు 20 మంది సబ్బవరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వరకు ఈ కవాతు నిర్వహించారు. అనంతరం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే విధంగా ప్రజల్లో విశ్వాసం నింపేందుకు ఈ కవాతు నిర్వహించినట్టు చెప్పారు. ఎస్పీ మురళీ కృష్ణ ఆదేశాల మేరకు సమస్యాత్మక,అతి సమస్యాత్మక గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్బవరం ఎస్ఐ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే జగన్ ధ్యేయం



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న సర్పంచ్ వరలక్ష్మిసీతారామయ్య

పరవాడ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతుందని నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య అన్నారు. నాయుడుపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం గృహ రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీ మేరకు నిరుపేద కుటుంబాలకు పక్కా ఇళ్లను మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందజేసి ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రమేష్, వీఆర్వో కమల, పార్టీ నాయకులు బండారు శ్రీను, కూండ్రపు యమహానాయుడు, బండారు శ్రావణ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే ఆధారమని, అటువంటి సంస్థలను ప్రైవేటీకరించడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1118వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఆధ్వర్యంలో బుధవారం నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం కల్పించనున్నట్లు ఇన్‌చార్జి బీకే రామకోటి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దేశంలోని ప్రసిద్ధ శివాలయాలు, లింగాల నమూనాలను బ్రహ్మకుమారీస్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. మూడు రోజుల నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టారు. బుధవారం ఉదయం పది గంటలకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, రాజయోగిని బీకే వేణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. జ్యోతిర్లింగాలను దర్శించి, ఈశ్వరీయ ప్రసాదం స్వీకరించాలని కోరారు.

ఎన్‌సీఈఆర్‌టీ బృందం సందర్శన



ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తున్న ఎన్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: గాజువాక మండలం కూర్మన్నపాలెం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను, కూర్మన్నపాలెంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను న్యూఢిల్లీకి చెందిన జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, రికార్డులు, మధ్యాహ్న భోజన సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు దిలీప్ శర్మ, నిఖిత, సోమయాజులు, గాజువాక ఎంఈవోలు విశ్వనాథం, ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు.